
రా.. కదలి రా!!
ఎన్నికల సమర శంఖారావానికి
2024 ఎన్నికలలో భాగంగా రాష్ట్రంలో గౌ॥ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు చేపట్టిన పార్లమెంటరీ నియోజకవర్గాల బహిరంగ సభలో భాగంగా నంద్యాల జిల్లా ఆళ్ళగడ్డ నియోజకవర్గంలో సమర శంఖారావాన్ని పూరించుటకు నేడు ఆళ్ళగడ్డకు విచ్చేస్తున్న తెలుగదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు గౌ॥ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి,తెలుగు దేశం- జనసేన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు, అతిరథ మహారథులందరికీ హృదయపూర్వక స్వాగత సుమాంజలులు
బహిరంగ సభ
తేది : 09-01-2024
మధ్యాహ్నం 2 గంటలకు
ఆళ్ళగడ్డ
గౌ॥ శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు
మాజీ ముఖ్యమంత్రివర్యులు
గౌ॥ శ్రీ నారా లోకేష్ గారు
తెలుగుదేశం పార్టీ
జాతీయ ప్రధాన కార్యదర్శి
మీ A.V. సుబ్బారెడ్డి



ఆళ్లగడ్డలో చంద్రబాబు సభ

- అరెస్టు తర్వాత మొదటిసారి జిల్లాకు..
- ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి



ఆళ్లగడ్డలోని సభా ప్రాంగణం

నంద్యాల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మంగళవారం ఆళ్లగడ్డకు రానున్నారు. స్కిల్ డెవలప్‌మెంటు కేసులో అరెస్టయిన తర్వాత చంద్రబాబు మొదటిసారి జిల్లాకు వస్తున్నారు. సభను విజయవంతం చేసేందుకు టీడీపీ శ్రేణులు సమాయత్తమయ్యాయి. సభకు దాదాపు లక్ష మందిని తరలించేందుకు ఆయా నియోజకవర్గాల నేతలు వారం రోజుల కిందటి నుంచి కసరత్తు ప్రారంభించారు.

బాబు సభపై ప్రజల్లో ఆసక్తి

గతేడాది సెప్టెంబరులో 'బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమంలో పాల్గొనేందుకు చంద్రబాబు నంద్యాలకు వచ్చారు. సభ ముగించుకుని స్థానిక ప్రైవేటు ఫంక్షన్ హాలులో బస చేస్తున్న ఆయనను స్కిల్ డెవలప్‌మెంటు కేసులో సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. ఈ ఘటనతో చంద్రబాబు మీద విపరీతమైన సానుభూతి ఏర్పడింది. బాబు బెయిల్‌పై విడుదలయ్యాక జిల్లాకు రావడం ఇదే మొదటిసారి కావడంతో జిల్లా ప్రజల్లో ఆసక్తి నెలకొంది.

ప్రతి నియోజకవర్గం నుంచి.

జిల్లా టీడీపీ నాయకులు తమ నియోజకవర్గాల నుంచి జనాన్ని సభకు తరలించేందుకు సిద్ధమయ్యారు. ఒక్కో నియోజకవర్గం నుంచి దాదాపు ఐదు వేల మందిని సమీకరించనున్నారు. సభ ప్రాంగణానికి సంబంధించిన ఏర్పాట్లను వారం రోజుల నుంచి ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జులు ఎప్పటికపుడు పర్యవేక్షిస్తున్నారు. ఇక ఆళ్లగడ్డలోని ప్రతి మండలం నుంచి కార్యకర్తలు, టీడీపీ అభిమానులు స్వచ్ఛందంగా సభలో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నారు. సమీప నియోజకవర్గమైన నంద్యాల నుంచి కూడా టీడీపీ సానుభూతిపరులు భారీగానే తమ సొంత వాహనాల్లో బాబు సభకు హాజరయ్యేందుకు సిద్ధమయ్యారు.

షెడ్యూలు ఇలా..

ఆళ్లగడ్డ: మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 2.10 గంటలకు ఆళ్లగడ్డలోని భూమా శోభానాగిరెడ్డి ఘాట్‌ను చేరుకుంటారు. మధ్యాహ్నం 2.20 గంటలకు భూమా దంపతులైన భూమా నాగిరెడ్డి, శోభానాగిరెడ్డిలకు నివాళులర్పిస్తారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి మధ్యాహ్నం 3.45 గంటలకు బీబీఆర్ పాఠశాలకు ఎదురుగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. సాయంత్రం 4.00 గంటలకు సభా ప్రాంగణం నుంచి 4.10 గంటలకు శోభా ఘాట్ చేరుకొని ఆ తరువాత 4.20 గంటలకు హెలికాప్టర్‌లో ఉండవల్లికి చేరుకుంటారు.



సాంప్రదాయక ఎరువుల వాడకం తగ్గించాలి

సహకార సొసైటీ సీఈవో ఖాజా మొహిద్దీన్‌తో మాట్లాడిన ప్రధాని మోదీ



అధికారులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తున్న రాజ్యసభ సభ్యుడు

పగిడ్యాల, జనవరి 8: సాంప్రదాయక ఎరువుల వాడకం తగ్గించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సూచించారని సహకార సొసైటీ సీఈవో ఖాజా మొహిద్దీన్ తెలిపారు. వికసింత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా పగిడ్యాల ఆదర్శ పాఠశాల ఆవరణలో పీఎం లైవ్ టెలికాస్ట్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. కర్ణాటక రాజ్యసభ సభ్యుడు వీరన్న కడాడి, కలెక్టరు మనిజిర్ జిలాని సామున్, జేసీ రాహుల్ కుమార్ రెడ్డి, జడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్ విజయమనోహరి, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు బైరెడ్డి శబరి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కర్ణాటక రాజ్యసభ సభ్యుడు వీరన్న కడాడికి జేసీ రాహులు కుమారు రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. సభ ఆవరణలో ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించిన స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. సభావేదికపై వికసిత్ భారత్ ప్రతిజ్ఞ, ప్రధానమంత్రి సందేశాన్ని వినిపించారు. అనతరం మధ్యాహ్నం 12.45 గంటలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పగిడ్యాల సహకార సొసైటీ సీఈవో ఖాజా మొహిద్దీన్‌తో ప్రసంగించారు. ప్రధాన మంత్రికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పథకాలతో ఏ విధంగా లబ్ధి పొందిందీ వివరించారు. ఏఐఎఫ్, డీసీసీబీ ద్వారా మండలంతో రూ.3 కోట్ల రుణం మంజూరైనదని, దీంతో తమ పరిధిలో రైతుల కోసం ఐదు గోదాములు నిర్మించామని తెలిపారు. ప్రధాన మంత్రి నానో యూరియా వాడకం గురించి ఖాజాను ప్రశ్నించారు. దీంతో మూడేళ్లుగా నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. నానో యూరియాతోపాటు సాంప్రదాయ ఎరువులు వాడటం వల్ల నేల ఆరోగ్యం దెబ్బతింటుందని, ఇలాగే జరిగితే భూములు పంటల సాగుకు పనికి రావని, దీంతో దేశం ఆర్థిక పరిస్థితి దెబ్బతింటుదని తెలిపారు. సాంప్రదాయ ఎరువుల వాడకాన్ని తగ్గించేందుకు కృషి చేయాలని తెలిపినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామీణ అభివృద్ధి శాఖ డిప్యూటీ సెక్రటరీ లలిత్ కుమార్, డీపీవో మంజులవాణి, ఆర్డీవో దాసు, జడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మల్లీశ్వరి, సర్పంచ్ శేషన్న వికసిత్ భారత్ జిల్లా అధికార ప్రతినిధి ఆదినారాయణ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నాగరాజు, పాల్గొన్నారు.



నంద్యాలలో ప్రచార రథాలను ప్రారంభిస్తున్న ఫరూక్, కాల్వ శ్రీనివాసులు

బీసీలను అణగదొక్కిన జగన్ ప్రభుత్వం

నంద్యాల (నూనెపల్లె), జనవరి 8: రాష్ట్రంలోని బీసీలను వైసీపీ ప్రభుత్వం అణగదొక్కిందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎన్ఎండీ ఫరూక్, కాల్వ శ్రీనివాసులు అన్నారు. నంద్యాలలోని జిల్లా టీడీపీ కార్యాలయం ఆవరణలో సోమవారం జయహో బీసీ ప్రచార రథాలను ప్రారంభిస్తారు. ఎన్ఎండీ ఫరూక్, కాల్వ శ్రీనివాసులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, బీసీ సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ వై.నాగేశ్వరరావు యాదవ్, నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు ఏవీఆర్ ప్రసాద్, వెదుర్ల రామచంద్రారావు, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదరి ఎన్ఎండీ ఫిరోజ్, తదితరులు హాజరయ్యారు. మాజీ మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, కాల్వ శ్రీనివాసులు జెండాలు ఊపి జయహో బీసీ ప్రచార రథాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని బీసీలపై వైసీపీ గుండాలు దాడులకు పాల్పడి చివరికి వారి ప్రాణాలను తీశారని మండిపడ్డారు. బీసీలకు సంక్షేమం, అన్ని రంగాలలో అభివృద్ధి చేసిన ఘనత ఒక్క చంద్రబాబుదేనని స్పష్టం చేశారు. టీడీపీ అధికారంలోకి రాగానే బీసీలకు రక్షణ చట్టం తీసుకొని వస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సాధికార కమిటీల రాష్ట్ర, జిల్లా నాయకులు, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఒక్క చాన్స్‌తో రాష్ట్రం సర్వనాశనం

టీడీపీ నంద్యాల పార్లమెంటు ఇన్‌చార్జి మాండ్ర



చంద్రపల్లి గ్రామంలో బాబు ష్యూరిటీ కార్యక్రమంలో పాల్గొన్న మాండ్ర శివానందరెడ్డి, నేతలు

ప్యాపిలి, జనవరి 8: ఒక్క చాన్స్‌తో సీఎం జగన్ రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని, మరో అవకాశం ఇస్తే ఏపీని బంగాళాఖాతంలో కలుపుతారని టీడీపీ నంద్యాల పార్లమెంటు ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని చంద్రపల్లి గ్రామంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి, టీడీపీ రాష్ట్ర బీసీ సాధికార సమితి కన్వీనర్ వై నాగేశ్వరరావుయాదవ్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో శివానందరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను జగన్ ఏ మాత్రం నెరవేర్చలేదన్నారు. ఉపాధి లేక యువత ఇతర రాష్ట్రాలని వలస పోవలసి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రెండు పార్లమెంటు స్థానాలను, అసెంబ్లీ స్థానాలను టీడీపీ కైవాసం చేసుకుంటుదని మాండ్ర ధీమా వ్యక్తం చేశారు. అనంతరం గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు సధాకర్‌రెడ్డి, సోమేష్‌రెడ్డి, హర్‌నాథ్‌రెడ్డి, ప్రసాద్‌తో పాటు పలువురు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామక్రిష్ణ, నాయకులు లక్ష్మినారాయణ యాదవ్, కోటేశ్వరరెడ్డి, ఆర్ఈ రాఘవేంద్ర, గండికోట రామసుబ్బయ్య, సుదర్శన్, జలదుర్గం విష్ణు, సురేంద్ర, సందీప్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు సీఎం ఆఫీసు ముట్టడి

నంద్యాల నూనెపల్లె, జనవరి 8 : మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ జనవరి 10వ తేదీ బుధవారం సీఎం ఆఫీస్ ముట్టడిస్తున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మధుశేఖర్, పట్టణ కార్యదర్శి శివ తెలిపారు. సోమవారం నంద్యాలలోని డీవైఎఫ్ఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి నిరుద్యోగులకు ఇచ్చిన మాటను తప్పాడని గుర్తుచేశారు. రాష్ట్రంలోని వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి ప్రతి ఏడాది జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని నిరుద్యోగులకు ఆశలు కల్పించి వారి ఓట్లతో అధికారంలోకి వచ్చి మోసం చేశారని మండిపడ్డారు. మెగా డీఎస్సీని విడుదల చేయాలని, జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించాలని, పలు మార్లు నిరసన కార్యక్రమాలు, ఆందోళనలు చేపట్టినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం దౌర్భాగ్యమన్నారు. ఈ నెల 3వ తేదీ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించినా ప్రభుత్వం స్పందించకపోవడంతో 10వ తేదీ ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు సీఎం కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు హరిబాబు, రవీంద్ర, సురేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఆకలి తీర్చినవాడు దైవ స్వరూపి

నంద్యాల నూనెపల్లె, జనవరి 8 : అన్నం పరబ్రహ్మ స్వరూపం అని ఆకలి తీర్చినవాడు దైవ స్వరూపమని డీఆర్వో పుల్లయ్య అన్నారు. సోమవారం కలెక్టరేట్ ఆవరణలో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గుడ్‌షెపర్డ్ సీపీఎల్ గ్రూప్ సహకారంతో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. జిల్లా నలమూలల నుంచి స్పందన కార్యక్రమానికి వినతులు అందించేందుకు వచ్చిన వినతిదారులకు అన్నదానం ఏర్పాటు చేశారు. డీఆర్వో పుల్లయ్య, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ పర్ల దస్తగిరి ముఖ్య అతిథులుగా హాజరై వినతిదారులకు అన్నదానం చేశారు. డాక్టర్ ఎంఎస్‌సీ మనోజ్‌కుమార్, క్రిస్టియన్ మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి కారు రవికుమార్, కామిరెడ్డి చర్చిల్, ఇంజర్ల ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.

నంద్యాల తాలుకా రూరల్ సీఐగా శివకుమార్‌రెడ్డి

నంద్యాల క్రైం, జనవరి 8 : నంద్యాల తాలుకా రూరల్ సీఐగా ఎస్.శివకుమార్‌రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా చిత్తూరు జిల్లా సత్యవేడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న శివకుమార్‌రెడ్డి నంద్యాల తాలుకా రూరల్ సీఐగా బదిలీ అయ్యారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం సీఐ నంద్యాల ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డిని జిల్లా పోలీస్ కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు.

నేటి నుంచి సంక్రాంతి సెలవులు

నంద్యాల (నూనెపల్లె), జనవరి 8: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 9వ తేదీ నుంచి 18వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ప్రభుత్వం ప్రకటించినట్లు డీఈవో సుధాకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలు సెలవుల రోజుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించకూడదని సూచించారు. తరగతులు నిర్వహించినట్లు తెలిస్తే పాఠశాల యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు చేపట్టతామని తెలిపారు. జిల్లాలోని డిప్యూటీ ఈవోలు, ఎంఈవోలు పర్యవేక్షించాలని సూచించారు. ఉపాధ్యాయులకు కూడా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు సెలవు దినాల్లో నిర్వహించకూడదని చెప్పారు.

రాజకీయాల్లో చెరగని ముద్ర : మాజీ ఎమ్మెల్యే భూమా



భూమా నాగిరెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న భూమా బ్రహ్మానందరెడ్డి

నంద్యాల (నూనెపల్లె), జనవరి 8: రాష్ట్ర రాజకీయాల్లో చిరస్థాయిగా చెరగని ముద్ర వేసుకున్న నాయకుడు భూమా నాగిరెడ్డి అని టీడీపీ మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం దివంగత మాజీ ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి జయంతి సందర్భంగా పొన్నాపురం కాలనీలో భూమా అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తల మధ్య జయంతి కార్యక్రమం నిర్వహించారు. భూమా నాగిరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి స్థానికులకు పంపిణీ చేశారు. 19వ వార్డులోని పొన్నాపురం కాలనీలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అండగా ఉంటాం

- న్యాయపోరాటానికి టీడీపీ నేతల సంఘీభావం
- 28వ రోజు కొనసాగిన అంగన్‌వాడీల సమ్మె
- పగిడ్యాలలో కలెక్టర్‌ను కలిసి వినతి

అంగన్‌వాడీ వర్కర్ల న్యాయ పోరాటానికి తెలుగు దేశం పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం బండిఆత్మకూరు, వెలుగోడు మండల కేంద్రాల్లో అంగన్‌వాడీ వర్కర్లు 28వ రోజు నిర్వహిస్తున్న నిరవధిక దీక్షా శిబిరాలను సందర్శించి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. 'టీడీపీ అధిష్టానం ఆదేశం మేరకు మీ పోరాటానికి అన్ని విధాలుగా అండా నిలుస్తాం.. ఇకనైనా వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు మానుకొని సమస్యలు పరిష్కరించాలి. ఇదే నిర్లక్ష్యం కొనసాగితే మహిళాశక్తి జగన్‌ను ఇంటికి సాగనంపటం ఖాయం' అంటూ బుడ్డా రాజశేఖరరెడ్డి వైసీపీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అలాగే పాములపాడులో కొనసాగుతున్న అంగన్‌వాడీ దీక్షా శిబిరాన్ని టీడీపీ నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు మాండ్ర శివానందరెడ్డి సందర్శించి మద్దతు తెలిపారు. అలాగే పగిడ్యాలలో అంగన్‌వాడీ వర్కర్లు కలెక్టరు మనజీర్ జిలానీ సమూన్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా పీఎం లైవ్ టెలికాస్ట్ కార్యక్రమానికి కలెక్టరు హాజరు కావడంతో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కరెడ్డి, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కలిసి తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు.

\- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



వెలుగోడులో అంగన్‌వాడీల దీక్షకు మద్దతు తెలుపుతున్న బుడ్డారాజశేఖరరెడ్డి



పాములపాడులో సమ్మెకు మద్దతుగా మాట్లాడుతున్న మాండ్ర శివానందరెడ్డి



పగిడ్యాలలో కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు



ఆత్మకూరులో సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు

గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలి

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి పిలుపు
- 'రా.. కదలిరా' సభ జయప్రదానికి సన్నాహాలు

పాణ్యం, జనవరి 8: టీడీపీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాల్సి ఉందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి అన్నారు. ఈ నెల 9వ తేదీన ఆళ్లగడ్డలో జరిగే రా కదలిరా మహా సభను జయప్రదం చేయడానికి సోమవారం తొగర్చేడు, మద్దూరు, గగ్గటూరు, కొత్తూరు, పాణ్యం గ్రామాల్లో పర్యటించారు. ఇందులో భాగంగా కార్యకర్తలతో చర్చించి బహిరంగ సభ జయప్రదం చేయాలని కోరారు. అలాగే జనసేన నాయకులను, కార్యకర్తలను కలిసి సభ జయప్రదం చేయాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 9వ తేదీన జరిగే బహిరంగసభకు టీడీపీ జాతీయ కార్యదర్శి నారా చంద్రబాబునాయుడు పాల్గొంటారన్నారు. సభకు మండలంలోని అన్ని గ్రామాల నుంచి కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. ఎంపీటీసి రంగరమేష్, జనసేన నాయకులు జగదీశ్‌బాబు, నాయకులు జయరామిరెడ్డి, రాంమోహన్‌నాయుడు, గుజ్జుల సుబ్బయ్య, సుధాకర్, మహేష్, విజయకుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.

గడివేముల: రాష్ట్రంలో జరుగుతున్న విధ్వంస పాలన మార్పుకు నాంది పలుకుతూ తెలుగుదేశం పార్టీ చేపట్టిన రా.. కదలిరా సభకు భారీగా



సమావేశంలో మాట్లాడుతున్న రమణారెడ్డి

తరలిరావాలని టీడీపీ పరిశీలకులు సామకోటి ఆదినారాయణ పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన గడివేముల, బూజనూరు, గడిగరేవుల, దుర్వేసి గ్రామాల్లో పర్యటించి నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బండిఆత్మకూరు : మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో రాదలిరా సభ జయప్రదం కోసం టీడీపీ ఉపాధ్యక్షుడు కంచర్ల సురేష్‌రెడ్డి, మండల యూనిట్ ఇన్‌చార్జి తాటికొండ బుగ్గరాముడు మండల నాయకులు, కార్యకర్తలతో సమావేశమై చర్చించారు. నాయకులు నరసింహారెడ్డి, కంచర్ల మనోహర్‌చౌదరి, సర్పంచ్ రామచంద్రుడు, సిద్ధయ్య, మహేశ్ తారక్, జాకీర్, కరీం, అన్వర్, కొత్తూరయ్య పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయండి : ఏవీ సుబ్బారెడ్డి

నంద్యాల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆళ్లగడ్డలో తలపెట్టిన సభను విజయవంతం చేయాలని విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకులు ఏవీ సుబ్బారెడ్డి సోమవారం ఓ ప్రకటన ద్వారా పిలుపునిచ్చారు. యువగళం పాదయాత్ర సమయంలోనే వైసీపీ గాలి పోయిందని, ఇక చంద్రబాబుతో పెట్టుకుని తమ గొయ్యి తామే తవ్వుకున్నారని, ఇపుడు చంద్రబాబు ఆళ్లగడ్డలో సభ పెడుతున్నారని తెలియగానే జిల్లా వైసీపీ నాయకులు వణికిపోతున్నారని, వచ్చే ఎన్నికల్లో జిల్లాలో టీడీపీ జెండా ఎగరడం ఖాయమన్నారు. నేడు జరుగుతున్న సభకు జిల్లా నలుమూలల నుంచి టీడీపీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని, జిల్లాలో టీడీపీకి ఉన్న పట్టును నిరూపించాలని టీడీపీ శ్రేణులను కోరారు.



మాట్లాడుతున్న ఏవీ సుబ్బారెడ్డి

కోటా వీధి వాసులు టీడీపీలో చేరిక



మాండ్ర సమక్షంలో టీడీపీలో చేరిన కోటవీధి వాసులు

నందికొట్కూరు రూరల్ జనవరి 8 : నందికొట్కూరు కోటవీధి వాసులు టీడీపీ కౌన్సిలర్ భాస్కరెడ్డి ఆధ్వర్యంలో నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. టీడీపీలో చేరిన వారిలో కమతం కృష్ణ, కమతం, పుల్లారెడ్డి, సుబ్బారెడ్డి, చిన్న సుబ్బా రెడ్డి, నాగేశ్వరావు, శంకర్, సురేష్, రాజేష్, దినేష్, యుగంధర్, మహేష్, అశోక్, వెంకటేష్, ప్రసాద్, రవి, శివ, మధు, చంద్రశేఖర్, లింగస్వామి, జగదీష్ తదితరులు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథరెడ్డి, కాతా రమేష్ రెడ్డి, ఓబుల్ రెడ్డి, నారుపురెడ్డి, జయసూర్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యకార్మికుల సమ్మెకు మద్దతు : మున్సిపల్ వర్కర్లు చేస్తున్న నిరవధిక సమ్మెకు నంద్యాల పార్లమెంట్ టీడీపీ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి మద్దతు తెలిపారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట వర్కర్ల దీక్షా శిబిరాన్ని సందర్శించి మాండ్ర సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్ల సమస్యలను టీడీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక పరిష్కరించేందుకు చంద్రబాబు నాయుడు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథరెడ్డి, జయసూరి, షకీల్ అహ్మద్, జాకీర్ హుశేన్ తదితరులు పాల్గొన్నారు.

భిక్షాటనతో మున్సిపల్ కార్మికుల నిరసన

నంద్యాల టౌన్, జనవరి 8: నంద్యాలలో మున్సిపల్ కార్మికుల సమ్మెలో భాగంగా పారిశుధ్య కాంట్రాక్టు కార్మికులు భిక్షాటన చేస్తూ వినూత్న తరహాలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో 6వ రోజు మున్సిపల్ కార్మికుల నిరవధిక సమ్మె జరిగింది. ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులు, అధ్యక్షుడు భూమిని శ్రీనివాసులు, కాంట్రాక్టు వర్కర్ల సంఘం అధ్యక్షుడు రంజిత్, కార్యదర్శి ప్రతాప్ ఆధ్వర్యంలో భిక్షాటన జరిగింది. మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్షకు కార్యాలయ ఆవరణలో ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ వైసీపీ ప్రభుత్వ తీరును తీవ్ర స్థాయిలో దుయ్యబట్టారు. గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా జగన్ ప్రభుత్వం కాలయాపన చేస్తుండటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. మున్సిపల్ కార్మికులతో పని చేయించుకోవడం తెలిసిన ప్రభుత్వం అందుకు తగ్గ వేతనాన్ని ఇచ్చేందుకు మాత్రం చేతులెత్తేయడం దారుణమని అన్నారు. ప్రభుత్వ తీరు కారణంగా మున్సిపల్ కార్మికులు, కార్మిక కుటుంబాలు ఆర్థిక దుస్థితిని ఎదుర్కొంటున్నాయని అన్నారు. ప్రైవేటు వ్యక్తులతో పనులు చేయించాలని చూస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మద్దయ్య, మస్తానయ్య, శివరాముడు, ఓబులేసుతోపాటు కార్మికులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



భిక్షాటన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

వినతులను సత్వరమే పరిష్కరించండి : డీఆర్వో

నంద్యాల (కల్చరల్), జనవరి 8: స్పందన వినతులపై తక్షణమే స్పందించి పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం వైయస్ఆర్ సెంటనరీ హాల్లో స్పందనలో ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్పందనలో 265 దరఖాస్తులు రాగా వాటన్నింటినీ విథిన్ ఎస్ఎల్ఏ లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్‌చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా అధికారులు పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

పద్మశాలీలయుల అభివృద్ధికి కృషి

- రాష్ట్ర పద్మశాలీయ ఆహ్వాన సంఘం కోచైర్మన్‌గా వెంకటసుబ్బయ్య

నంద్యాల (కల్చరల్), జనవరి 8: రాష్ట్రంలోని పద్మశాలీయుల అభివృద్ధికి కృషిచేస్తానని పద్మశాలీయ ఆహ్వాన సంఘం కోచైర్మన్ భీమునిపల్లె వెంకటసుబ్బయ్య అన్నారు. ఆదివారం చీరాల పట్టణంలో పద్మశాలీయ సమన్వయ కమిటీ సమావేశంలో భీమునిపల్లె వెంకటసుబ్బయ్యను రాష్ట్ర పద్మశాలీయ ఆహ్వాన సంఘం కో చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నంద్యాల, కర్నూలు జిల్లాల పద్మశాలీయ సంఘంనేతలు అభినందనలు తెలిపారు. అఖిలభారత పద్మశాలి సంఘం ఉపాధ్యక్షుడు వద్ది నరసింహులు, రాయలసీమ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ పాల్గొన్నారన్నారు.

పార్టీ అభివృద్ధికి కలిసి కట్టుగా కృషి చేయాలి

నంద్యాల (కల్చరల్), జనవరి 8: బీజేపీ అభివృద్ధికి జిల్లా నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా కృషిచేయాలని ఆ పార్టీ నంద్యాల అసెంబ్లీ కన్వీనర్ అభిరుచి మధు అన్నారు. సోమవారం పట్టణంలోని హరిజనవాడ, పెద్దబండ ప్రాంతాలకు చెందిన పలువురు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా వీరిని అభిరుచి మధు పార్టీలోకి సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువాలు కప్పారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉర్దూ మెటీరియల్ పంపిణీ

నంద్యాల రూరల్, జనవరి 8 : మండలంలోని అయ్యలూరు గ్రామ పరిషత్ ప్రాథమికోన్నత ఉర్దూ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఉర్దూ మెటీరియల్ పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అబ్దుల్ అజీజ్, జిల్లా ప్రథమ్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఎం.డీ వలి ఆధ్వర్యంలో జరిగిన ఈ పంపిణీలో ఉర్దూ, గణితం, ఉర్దూ స్టోరీ టెల్లింగ్, డ్రిల్లింగ్ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు కలీముల్లా, నజీర్ పాల్గొన్నారు.

బ్యాటరీ ట్రై సైకిల్‌ను వెంటనే ఇవ్వాలి

నంద్యాల రూరల్, జనవరి 8 : దివ్యాంగులకు పెండింగ్‌లో ఉన్న బ్యాటరీ ట్రై సైకిల్‌ను వెంటనే ఇవ్వాలని డిజేబుల్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డీపీ మస్తాన్ వలి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 2021లో ఎంపీ ల్యాండ్స్ కింద జరిగిన ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి 70 మంది వికలాంగులు గైర్హాజరయ్యారని, వారికి వెంటనే ట్రై సైకిళ్లను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. మస్తాన్ వలి వెంట ఉపాధ్యక్షుడు కిరణ్ కుమార్, సహాయ కార్యదర్శి ఎల్లయ్య పాల్గొన్నారు.

గూడెంలో సంక్రాంతి సంబరాలు

కొత్తపల్లి, జనవరి 8: ముందస్తు సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండలంలోని పాలెం చెరువు చెంచు గూడెంలో గిరిజన మహిళలు ముత్యాల ముగ్గులు వేసి ఔర అనిపించారు. సోమవారం స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం చంద్రశేఖర్, వార్డన్, పేరయ్యల ఆధ్వర్యంలో అడవి బిడ్డలచే సాంప్రదాయాలకు అద్దం పట్టేలా సంక్రాంతి ముగ్గులు వేయించి అందరినీ అబ్బుర పరిచారు. ఈసందర్భంగా వార్డన్ పేరయ్య మాట్లాడుతూ.. చెంచు మహిళల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం చెంచు మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు.ఉపాధ్యాయురాలు రాణమ్మ, దరగమ్మ, రీనాబేగం, రాణి, ఉపాధ్యాయులు రామదస్తగిరిలు ఉన్నారు.

జాతీయ స్థాయి తైక్వాండోలో పతకాలు

నంద్యాల నూనెపల్లె, జనవరి 8 : జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ తైక్వాండో అండర్-14, 17, 19 బాల, బాలికల విభాగాల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిథ్యం వహించిన జిల్లా క్రీడాకారులు అత్యంత ప్రతిభ కనబరచి పతకాలు సాధించారని జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి శివకుమార్ సోమవారం తెలిపారు. డిసెంబర్ 31నుంచి జనవరి 5వరకు మధ్యప్రదేశ్‌లోని బీటల్‌లో జరిగిన పోటీల్లో జిల్లాకు చెందిన దొర్నిపాడు మండలం భాగ్యనగరం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని ఆకుల సమీరా కాంస్య పతకం సాధించిందన్నారు. అదే పాఠశాలకు చెందిన రాముడు 5వ స్థానం సాధించినట్లు చెప్పారు. డీఈవో సుధాకర్, డిప్యూటీ ఈవో మహబూబ్‌బేగ్, ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి శివకుమార్ డీఈవో కార్యాలయంలో అభినందించారు.

క్రీడలతో వికాసం : ఎస్పీ

నంద్యాల నూనెపల్లె, జనవరి 8 : చదువుతోపాటు విద్యార్థులకు క్రీడలు ఎంతో అవసరమని, క్రీడలతో మానసిక వికాసం, శారీరక ధారుఢ్యం పెంపొందుతుందని ఎస్పీ రఘువీర్‌రెడ్డి అన్నారు. నంద్యాల క్రాంతినగర్‌లో సీబీఎస్ఈ స్కూల్‌లో సింథటిక్ టర్ఫ్ క్రీడా మైదానం ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం జరిగింది. శాంతినికేతన్ విద్యా సంస్థల చైర్మన్ సుధాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎస్పీ రఘువీర్‌రెడ్డి, ఏఎస్పీ వెంకటరాముడు ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ, ఏఎస్పీ మాట్లాడుతూ క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు క్రీడా రిజర్వేషన్‌పై ఉన్నత విద్య, ఉద్యోగాలను పొందవచ్చన్నారు. క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని చెప్పారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సింథటిక్ టర్ఫ్ క్రీడా మైదానాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల కరస్పాండెంట్ రమ్యారెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



సింథటిక్ టర్ఫ్ క్రీడా మైదానాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

ఆటో - స్కూటర్ ఢీ

- నలుగురికి గాయాలు
- అమృత్ పథకం పైపులైన్ పనుల వద్ద ప్రమాదం



రోడ్డు సైడ్ పొలాల్లోకి బోల్తా కొట్టిన ఆటో

బండిఆత్మకూరు, జనవరి8 : మండలంలోని ఏ కోడూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. స్థానికుల వివరాల మేరకు గ్రామ శివారులోని రైస్ మిల్ సమీపాన నంద్యాల నుంచి ఆత్మకూరు వెళ్తున్న ఆటో, పెద్దదేవళాపురం నుంచి నంద్యాల వైపు వెళ్తున్న స్కూటర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో స్కూటర్‌పై వెళ్తున్న శివనాగయ్య ఆచారీ మోకాలు విరిగింది. ఆటో డ్రైవర్ శేషు, సుందరాజు. త్యాగరాజులకు గాయాలయ్యాయి. ఇటీవల అమృత్ పైప్ లైన్ పనులను కాంట్రాక్టర్ చేపట్టారని, ఆ పనుల వద్దనే ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. గతంలో పార్నపల్లె వద్ద కూడా ప్రమాదాలు జరిగి వాహన దారులు గాయాలపాలయ్యారు. అమృత్ పథకం పనుల వద్ద సరైన ప్రమాద సూచికల ఏర్పాటు లేకపోవటంతోనే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని, పోలీసులు ఏ మాత్రం పట్టించుకోవట లేదని వాహనదారులు వాపోతున్నారు. ప్రమాదాలు ఇన్ని జరుగుతున్నా పోలీసులు చర్యలు తీసుకోకపోవటం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. క్షతగాత్రులను నంద్యాలకు చికిత్స నిమిత్తం 108 వాహనంలో తరలించారు.

శ్రీశైలంలో అభివృద్ధి పనుల పరిశీలన

శ్రీశైలం, జనవరి 8: శ్రీశైలం దేవస్థానంలో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి సోమవారం ఆలయ అధికారులతో కలిసి పరిశీలించారు. పరిశీలనలో భాగంగా ఆలయ ప్రధాన వీధిలో జరుగుతున్న బి.టి రోడ్డు పనులు, ఆలయ దక్షణగోపురం ఎదురుగల భక్తులు వేచివుండు గది, క్యూలైన్ల సమీపంలోని నెం. 1 క్యాంటీన్ తొలగింపు పనులు, ఆలయ పడమట వీధి సుందరీకరణ తదితర వాటిని పరిశీలించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు రామకృష్ణ, మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణసేవ



స్వామి, అమ్మవార్లకు రథోత్సవం నిర్వహిస్తున్నదృశ్యం

శ్రీశైల క్షేత్రంలో సోమవారం భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లకు సహస్ర దీపాలంకరణ సేవను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులను చేసి, అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో పూజలు చేశారు. అనంతరం సహస్ర దీపాలంకరణ సేవను నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను వెండి రథంపై ఆశీనులనుజేసి ప్రత్యేక పూజలు, మంగళహరతులతో రథోత్సవాన్ని నిర్వహించారు.

అలరించిన నిత్యకళారాధన : శ్రీశైల దేవస్థానం ధర్మపథంలో భాగంగా నిర్వహిస్తున్న నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా సోమవారం రాజమండ్రికి చెందిన రాజేశ్వరి కూచిపూడి నృత్య కళాశాల బృందం సంప్రదాయ నృత్యప్రదర్శన ఏర్పాటు చేసింది. కార్యక్రమంలో మహాగణపతిం, వినాయక పంచరత్నాకృతి, ఆనందతాండవం, శంకరా శ్రీగిరివాసా తదితర గీతాలకు వైష్ణవి, లలిత, అఖిల, హరిణి, లాస్య, సంధ్య, వేద, జ్యోత్స్న, కీర్తి తదితరులు నృత్య ప్రదర్శనతో అలరించారు.

వైసీపీకి గుణపాఠం చెబుతాం

- అంగన్‌వాడీల హెచ్చరిక
- 28వ రోజు కొనసాగిన సమ్మె
- ఎస్మా చట్టం ప్రయోగించడం దుర్మార్గం
- డిమాండ్లు నెరవేర్చే దాకా సమ్మె కొనసాగుతుందని స్పష్టం

డిమాండ్లను నెరవేర్చకపోతే వైసీపీకి తగిన గుణపాఠం చెబుతామని అంగన్‌వాడీలు హెచ్చరించారు. వారు చేపట్టిన సమ్మె సోమవారం 28వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా అంగన్‌వాడీలు వినూత్న రీతుల్లో నిరసన తెలిపారు. సమ్మెకు వివిధ సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. అంగన్‌వాడీలు మాట్లాడుతూ ఎస్మా చట్టం ప్రయోగించడం దుర్మార్గమని అన్నారు. ప్రభుత్వ బెదిరింపులకు భయపడబోమని, సమస్యలు పరిష్కరించే దాకా సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. జీవో నెంబరు 2 ఉత్తర్వులు జారీ చేయం సరికాదని అన్నారు. అధికారంలోకి వస్తే హామీలు నెరవేర్చుతామని చెప్పిన జగన్, ఆ తర్వాత పట్టించుకోవడం లేదని వాపోయారు. తమను నిర్లక్ష్యం చేస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అంగన్‌వాడీలు హెచ్చరించారు.


చాగలమర్రిలో పచ్చిగడ్డి తింటూ నిరసన


ఆళ్లగడ్డలో ఒంటికాలిపై..


దొర్నిపాడులో మోకాలిపై నిరసన


సంజామలలో చెవులు మూసుకొని..



రుద్రవరంలో..


ఉయ్యాలవాడలో..


కోవెలకుంట్లలో వేపాకు తింటూ నిరసన


బేతంచెర్లలో 28 ఆకారంలో కూర్చున్న అంగన్‌వాడీలు

సైకో సీఎం పాలన వల్ల ఒక తరం నష్టపోయింది: బీసీ


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, జనవరి 8: సైకో సీఎం జగన్ పాలన వల్ల ఒక తరం నష్టపోయిందని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. సోమవారం టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్‌కు సంక్షేమం పట్టదన్నారు. విధ్వంసం, అరాచకం తప్ప ఆయన డైరీలో ఏ పదం లేదన్నారు. ఏపీ రాష్ట్రంలో యువతీ యువకుల జీవితాల్లో చీకట్లు నింపార న్నారు. దేశంలో ఏరాష్ట్రం ఇంతగా నష్టపోలేదన్నారు. ప్రజావేదిక కూల్చివేతతో ప్రారంభమైన జగన్ పాలన ఇప్పటికీ అదేవిధంగా కొనసాగుతోందిదని విమర్శించారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖలను రోడ్డున పడేసి రైతన్నల నడ్డి విరిచారన్నారు. పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధరలేదన్నారు. ఏపీలో రోజుకు ముగ్గురు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌలు రైతుల ఆత్మహత్యల్లో రాష్ట్రం దేశంలోనే రెండో స్థానం, రైతు ఆత్మహత్యల్లో మూడో స్థానంలో ఉందని తెలిపారు. అప్పుల్లో మొదటి స్థానంలో ఉందన్నారు. డ్రిప్పు సబ్సిడీలు లేవు, పని ముట్ల సబ్సిడీలు లేవు. మద్దతు ధర లేదు. సైకో సీఎం అన్నదాతకు బతుకే లేకుండా చేశారని విమర్శించారు. సాగునీటి ప్రాజెక్టులను అటకెక్కించారని, కాల్వల్లో కనీసం పూడిక కూడా తీయని అసమర్థ ప్రభుత్వం వైసీపీ అన్నారు. కాంట్రాక్టర్లే వైసీపీ ప్రభుత్వాన్ని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టారన్నారు. డీఎస్సీని అటకెక్కించారన్నారు. పోలీసు ఉద్యోగాలకు దిక్కులేదన్నారు. పెట్టుబడులు రావని, వచ్చినా వైసీపీ నాయకుల కమీషన్లకు భయపడి పారిశ్రామికవేత్తలు పారిపోతున్నారన్నారు. టీడీపీ హయాంలో పరిశ్రమలను తెస్తే నేడు జగన్ ప్రభుత్వం టెర్రరిజం తెచ్చి కంపెనీలను తరిమివేసిందని ఆరోపించారు. అన్ని వ్యవస్థలను రద్దు చేసి సీఎం జగన్ రాక్షసానందం పొందుతున్నారని విమర్శించారు. మూడు నెలల్లో ఈ జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు రద్దు చేసి గుణపాఠం చెప్పనున్నారన్నారు.

'చంద్రబాబు హయాంలోనే ముస్లింల సంక్షేమం'


చంద్రబాబు సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మౌలాన ముస్తాక్ అహ్మద్

చాగలమర్రి, జనవరి 8: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలోనే ముస్లిం మైనార్టీల అభివృద్ధి జరిగిందని మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మౌలాన ముస్తాక్ అహ్మద్ అన్నారు. మంగళవారం ఆళ్లగడ్డలో జరిగే చంద్రబాబు బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాలుగేళ్ల వైసీపీ పాలనలో ముస్లింలకు తీరని అన్యాయం జరిగిందని ఆరోపించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ముస్లింలకు అందాల్సిన పథకాలను రద్దు చేసి మైనార్టీలను దగా చేశారని ధ్వజమెత్తారు. చంద్రబాబు ప్రకటించిన మినీ మ్యానిఫెస్టో ముస్లింలకు ఎంతో భరోసాగా ఉందన్నారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీకి తగిన గుణపాఠం చెప్పాలని, ముస్లిం మైనార్టీలంతా టీడీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. సమావేశంలో టీడీపీ నాయకులు మౌళాలి, అనిఫ్, ఖలీల్, కొలిమి అస్రఫ్, మక్బూల్ తదితరులు పాల్గొన్నారు.

'సభను జయప్రదం చేయాలి'


రుద్రవరంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పరిశీలకుడు సత్యనారాయణ

రుద్రవరం, జనవరి 8: టీడీపీ అధినేత నారాచంద్రబాబు సభను జయప్రదం చేయాలని ప్రకాశం జిల్లా ప్రధాన కార్యదర్శి రుద్రవరం మండల పరిశీలకుడు సత్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం రుద్రవరంలో టీడీపీ నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఆళ్లగడ్డలో మంగళవారం జరగబోయే రా కదలిరా.. బహిరంగసభను విజయవంతం చేయాలని కోరారు. ఎల్వీ రంగనాయకులు, బాచుపల్లె వెంకటనారాయణ, మాజీ సర్పంచ్ గురుమూర్తి, రామసుబ్బా రెడ్డి, మనోహర్‌రెడ్డి, నంద్యాల జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కొమ్మలపాటి రాజారావు, శేఖ ర్, పార్థసారధిరెడ్డి, యువరాజు, స్వామదాసు, సుబ్బారావు పాల్గొన్నారు.

'భూమా నాగిరెడ్డి సేవలు మరువలేనివి'


చాగలమర్రిలో నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, జనవరి 8: దివంగత నంద్యాల మాజీ ఎమ్మెల్యే భూమా నాగిరెడ్డి సేవలు మరువలేనివని టీడీపీ బీసీ సెల్ నంద్యాల అధికార ప్రతినిధి సల్లా నాగరాజు అన్నారు. సోమవారం చాగలమర్రి టీడీపీ కార్యాలయంలో భూమా నాగిరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకులు ఓబులేసు, జోసఫ్, మహబూబ్‌బాషా, బషీర్, రమేష్, రాజేష్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ సేవ


పల్లకీ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

బనగానపల్లె, జనవరి 8: మండలంలోని యాగంటి ఉమామహేశ్వర స్వామి ఆలయంలో సోమవారం పల్లకీ సేవను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ తోట బుచ్చిరెడ్డి, ఈవో చంద్రశేఖర్‌రెడ్డి, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డితో పాటు భక్తులు, ఆలయ పూజారులు పల్లకీలో ఉత్సవ విగ్రహాలను ఆలయ చుట్టూ ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం

కోవెలకుంట్ల, జనవరి 8: పట్టణంలోని విక్కీ ఫౌండేషన్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు రూ.21 వేలు ఆర్థిక సాయం సోమవారం అందించారు. పట్టణంలోని ఓ పాఠశాలలో చదువుతున్న ఇరువురు పేద విద్యార్థులకు విద్య కోసం పాఠశాల ప్రిన్సిపాల్ చేతుల మీదుగా అందించారు. అమ్మానాన్న లేని చిన్నారులకు ప్రతి ఏటా ప్రతాప్‌రెడ్డి ప్రతి ఏటా కోవెలకుంట్ల పట్ట ణంలో పేదలకు ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఈ ఏడాది కూడా అందించారు.

వేధింపుల కేసు నమోదు

బేతంచెర్ల, జనవరి 8: పట్టణంలోని అల్లాబకాష్ దర్గా కాలనీలోని కుంచవల్లి ఆదిలక్ష్మిని అత్తమామలు అదనపుకట్నం కోసం వేధిస్తున్నారన్న ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు బేతంచెర్ల హెడ్ కానిస్టేబుల్ సాబ్జాజీవలి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కల్లూరు మండలం ఉలిందకొండ గ్రామానికి చెందిన రవికుమార్‌తో బేతంచెర్లకు చెందిన ఆదిలక్ష్మి మూడేళ్ల క్రితం వివాహమైంది. గత కొంత కాలంగా అదనపు కట్నం తేవాలని అత్త వెంకటలక్ష్మి, మామ జానకిరాముడు అద నంగా కత ఇవ్వాలని వేధిస్తున్నట్లు బాధితురాలు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అహోబిలంలో పూజలు


స్వర్ణ నరసింహ స్వామికి పూజలు చేస్తున్న పీఠాధిపతి

ఆళ్లగడ్డ, జనవరి 8: అహోబిలం పీఠాధిపతి రంగనాథయతీంద్ర మహాదేశికన్ మఠంలోని స్వర్ణ నరసింహస్వామికి సోమవారం పూజలు చేశారు. స్వర్ణ నరసింహస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి మహా హారతి ఇచ్చారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు.

ఆలయానికి టికెట్ కౌంటర్ విరాళం


టికెట్ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

బనగానపల్లె, జనవరి 8: బనగానపల్లె పట్టణానికి చెందిన వస్త్ర వ్యాపారులు గుండా రవికుమార్ సోదరులు సోమవారం 1.25లక్షల విలువ చేసే టికెట్ కౌంటర్‌ను విరాళంగా అందించారు. ఆలయంలో టికెట్లు విక్రయించడానికి నూతనంగా 1.25 లక్షలతో తయారు చేయించి ఆలయానికి విరాళంగా అందించినట్లు ఈవో రామానుజన్ తెలిపారు. నూతన టికెట్ కౌంటర్‌ను ఈవో ప్రారంభించారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలు గుండా నాగసుప్రజ, వాసవీక్లబ్ అసిస్టెంట్ గవర్నర్ శ్రీరామ వెంకటసుబ్రమణ్యం, బనగానపల్లె ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు వేణుగోపాల్, గుండా మురళీధర్, గుండా శ్రీనివాసులు, నాగరాజు, మోహన్, ఆలయ సిబ్బంది, పూజారులు పాల్గొన్నారు.

'పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం'

చాగలమర్రి, జనవరి 8: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. సోమవారం చాగలమర్రి ఎస్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో పింఛన్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కొత్తగా మంజూరైన పింఛన్‌లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనంతరం మద్దూరు గ్రామంలో రైతు భరోసా కేంద్రాన్ని, సీసీ రోడ్లను ప్రారంభించారు. ఐదుగురు రైతులకు ఉపాధిహామీ పథకం ద్వార మంజూరైన విద్యుత్ మోటార్లు, పైపులను పంపిణీ చేశారు. ఎంపీపీ వీరభద్రుడు, జేసీఎస్ జిల్లా కో-ఆర్డినేటర్ బాబులాల్, మండల కన్వీనర్ కుమార్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు దస్తగిరి, జడ్పీటీసీ లక్ష్మీదేవి, ఏడీఏ రామ్మోహన్‌రెడ్డి, ఏవో రంగనేతాజీ, ఎంపీడీవో మహబూబ్‌దౌలా, ఏపీడీ సాంబశివరావు, పీఆర్‌డీఈ నరసింహులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్లేట్లు పంపిణీ

ఆళ్లగడ్డ, జనవరి 8: ఆళ్లగడ్డలోని పాలసాగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన ప్లేట్లను అవోపా, ఇన్నర్‌వీల్ కార్యవర్గ సభ్యులు సోమవారం పంపిణీ చేశారు. అవోపా సేవానిధిని ఖర్చు చేసి ప్లేట్లను కొనుగోలు చేసినట్లు కార్యవర్గ సభ్యులు తెలిపారు. ప్రభాకర్‌రావు, సుజాత పాల్గొన్నారు.

'రీ సర్వేలో అభ్యంతరాలు ఉంటే చెప్పండి'

ఉయ్యాలవాడ, జనవరి 8: రీ సర్వే గ్రామాల్లో సర్వేపై అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకరావాలని తహసీల్దారు రవికుమార్ తెలిపారు. సోమవారం రూపనగుడి గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని గోవిందపల్లె, రూపనగుడి, సుద్దమల్ల, నర్సిపల్లె, కొండుపల్లె గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేసి సర్వే పత్రాలు పంపిణీ చేశామని, దీనిపై కొలతల్లో వ్యత్యాసాలు, పాసు పుస్తకాల్లో రీ ఎంట్రీ తదితర సమస్యలు ఉంటే రాత పూర్వకంగా తమకు ఇవ్వాలని సూచించారు. ఆర్ఐ తులసికృష్ణ, మండల సర్వేయర్ విజయలక్ష్మి, వీఆర్వో వెంకటలక్ష్మి, గ్రామ సర్వేయర్ విశ్వనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేపు 'రాయలసీమ సింహగర్జన' సభ

డోన్ (రూరల్), జనవరి 8: అనంతపురంలో బుధవారం జరిగే రాయలసీమ సింహగర్జన సభను పార్టీలకతీతంగా అన్ని వర్గాల ప్రజలు జయప్రదం చేయాలని బీసీవై పార్టీ డోన్ నియోజకవర్గ నాయకులు బాలు యాదవ్ పిలుపునిచ్చారు. సోమవారం సింహగర్జనకు సంబంధించిన పోస్టరును విడుదల చేశారు. కార్యక్రమంలో సురేష్, వెంకట్రాముడు, ఆర్య, సురేంద్ర, కేదార్ తదితరులు ఉన్నారు.

డిప్యూటీ తహసీల్దారు మృతి


వెంకటస్వామి (ఫైల్)

ఉయ్యాలవాడ, జనవరి 8: డిప్యూటీ తహసీల్దారు బబ్బూరి వెంకట స్వామి అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధ పడుతూ సోమవారం మృతి చెందారు. 2018లో సీనియర్ అసిస్టెంట్‌గా ఉయ్యాలవాడకు వచ్చారు. అనంతరం 2020లో డిప్యూటీ తహసీల్దారుగా పదోన్నతి పొందారు. విషయం తెలిసిన వెంటనే తహసీల్దారు రవికుమార్ సిబ్బందితో కలిసి మృత దేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మంగళవారం ఉదయం వారి స్వగృహ మైన దొర్నిపాడు మండలంలోని రామచంద్రాపురంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి.. భార్యకు గాయాలు

ఆళ్లగడ్డ, జనవరి 8: ఆళ్లగడ్డ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిచింతకుంట సమీపంలో భార్యాభర్తలను కారు ఢీకొన్న ఘటనలో భర్త రామాంజనేయులు(40) మృతి చెందగా భార్య సమాదానమ్మకు గాయపడ్డారు. సోమవారం మోటార్ సైకిల్‌పై ఆళ్లగడ్డ నుంచి కూరగాయలను తీసుకొని వెళ్తుండగా పి.చింతకుంట సమీపంలో గోదాము వద్ద కూరగాయల సంచి కింద పడిపోయింది. వాటిని సేకరించుకుంటున్న భార్యభర్తలను కోవెలకుంట్ల నుంచి ఆళ్లగడ్డకు వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో భార్యభర్తలిద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వీరిని 108లో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా భర్త రామాంజనేయులు చికిత్స పొందుతూ మృతి చెందారు. సమాదానమ్మ చికిత్స పొందుతున్నారు. పట్టణ ఎస్ఐ వెంకటరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ముగ్గురికి గాయాలు

సంజామల: ఆటో, మోటారు సైకిల్ ఢీకొన్న ఘటనలో అవుకు పట్టణానికి చెందిన ముగ్గురు గాయపడ్డారు. అవుకు పట్టణానికి చెందిన రవి, సాయి, మహేంద్ర ముగ్గురు మోటారు సైకిల్‌పై సంజామల మండలం ఆకుమళ్లకు వచ్చి తిరిగి వెళ్తుండగా సింగనపల్లె ఆకుమళ్ల మధ్యలో ప్రమాదం జరిగింది. రవికి కాళ్లు విరిగిపోయాయి. మరో ఇరువురు స్వల్పంగా గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో బనగానపల్లె వైద్యశాలకు తరలించి అక్కడినుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు వైద్యశాలకు తరలించారు. సంజామల పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.